క్లుప్తంగా

విధులకు హాజరైన అంగన్‌వాడీలు



విధులకు హాజరైన అంగన్‌వాడీ సిబ్బంది

సంబేపల్లె : మండల పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది విధులకు హాజరయ్యారు. 42 రోజులుగా సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది ప్రభుత్వంతో జరిపిన షరతులు సఫలం కావడంతో సమ్మెను విరమించి విధులకు హాజరయ్యారు. తమ డిమాండ్‌ల పట్ల సానుకూలంగా స్పందించిన అంగన్‌వాడీలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : నూతన జాతీయ విద్యావిధానం – 2020 ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ నేతలు రాయచోటిలో సంతకాల సేకరణ చేపట్టారు. మొదటగా సీపీఐ, ఏఐఎస్‌ఎఫ్ నేతలు సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పురస్కరించుకుని బంగ్లా సర్కిల్‌లోని నేతాజీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడ నుండి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ చిత్రపటం వద్దకు చేరుకున్నారు. అనంతరం సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో సీపీఐ నరసింహులు, ఎస్టీయూ రాష్ట్ర నేత యర్రపురెడ్డి రవీంద్రనాథరెడ్డి, యూటీఎఫ్ నేత జాబిర్, ఏఐటీయూసీ సాంబశివ, విశ్వనాథనాయక్, రంగారెడ్డి, రెడ్డెయ్య, శంకర్‌నాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యవసర పనులకు ఆర్థికసంఘం నిధులు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలానికి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకోవాలని మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓతో కలిసి మండలానికి వచ్చిన నిధులను ఏయే పనులకు ఉపయోగించాలో చర్చించారు. గ్రామీణ ప్రాంతాలలో అత్యవసరమైన పనులకు నిధులు ఉపయోగించాలన్నారు. మండలానికి రూ. 25 లక్షలు నిధులు వచ్చాయన్నారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ గంగులయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, వ్యవసాయ సలహామండలి మండల అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, సానారెడ్డిలతోపాటు పలువురు నాయకులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం



నగదు అందిస్తున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని తాడేవాండ్లపల్లెకు చెందిన సుబ్బయ్య ఆధ్వర్యంలో ఈ నెల 25న జరిగే పెంచలకోన పాదయాత్రలో పాల్గొనే భక్తులకు వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి అన్నదానం చేయనున్నారు. మంగళవారం వైస్ ఎంపీపీ అన్నదానం ఖర్చులకు రూ.20 వేలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామక్రిష్ణ, రమణారెడ్డి, రాజారెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు రాజంపేటలో ఈశ్వరీదేవి పీఠం పర్యటన

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణంలో గురువారం జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి పీఠం పర్యటన నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాచగుండ్ల లక్ష్మీప్రసన్నాచారి తెలిపారు. స్థానికంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. స్థానికంగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం ఉదయం నాదనీరాజనం, శ్రీమహాగణపతిపూజ, కలశస్థాపన, అభిషేకం, సామూహిక కుంకుమార్చనలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీఈశ్వరీదేవి మఠం మఠాధిపతి శ్రీ వీరశివ కుమారస్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తారని చెప్పారు. సాయంత్రం మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామితో పాటు వారి మనవరాలైన ఈశ్వరీదేవి ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మున్సిపల్ వార్షిక బడ్జెట్ ఆమోదం

- కౌన్సిల్‌కు తెలియకుండా పనులు చేపట్టడంపై సభ్యుల ఆగ్రహం
- వాడీవేడిగా సాగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ కౌన్సిల్‌కు తెలియకుండా ముందస్తుగా పనులు చేపట్టి తర్వాత వాటి ఆమోదం కోసం సమావేశంలో పెడతారా ? అంటూ మున్సిపల్ అధికారులపై చైర్మన్‌తోపాటు కౌన్సిలర్లు మండిపడ్డారు. మంగళవారం డాక్టర్ వైఎస్‌ఆర్ మున్సిపల్ సభా భవనంలో చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో మొదటగా ఇటీవల మృతి చెందిన కౌన్సిల్ సభ్యుడు జయన్న నాయక్ మృతికి కౌన్సిల్ సభ్యులు సంతాపం తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెల్పింది. నలుగురు ఎక్స్ సర్వీస్ మెన్‌ల ఇళ్లకు పన్ను మినహాయింపు, మరణించిన ఇరువురు పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2లక్షల చొప్పున ఆర్థిక సహాయం, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ వర్కర్‌లుగా నియమించేందుకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం సర్వే నంబరు 6.04లో నిర్మింప తలపెట్టిన పార్కు స్థలంలో చేపట్టిన అభివృద్ధి పనుల ఆమోదానికి సంబంధించిన చర్చలో కౌన్సిలర్లు హారూన్, సుగవాసి ఈశ్వర్, కొలిమి చాన్‌బాషా, అల్తాఫ్, వైఎస్‌ఆర్‌సీపీ నేత సుగవాసి శ్యామ్ కుమార్‌లు మున్సిపల్ కమిషనర్ తోపాటు అధికారులపై మండిపడ్డారు. పార్కు నిర్మాణ పనులు పూర్తి చేసి సభలో ఎలా అజెండాలో పెడతారంటూ కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. చర్చలో చైర్మన్ ఫయాజ్ బాషా జోక్యం చేసుకుంటూ సదరు పనులు అత్యవసరమైనందున, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టామంటూ సభకు తెలియజేశారు. రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీకి కేటాయించిన కోట్లాది రూపాయల స్థలాన్ని చదును చేసి, చుట్టూ కంచె ఏర్పాటు చేసేందుకు నిధులు ఖర్చు చేశామంటూ సభ్యులకు వివరించారు. తాము పరిష్కరించాలని కోరుతున్న సమస్యలపై మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడం లేదంటూ కౌన్సిలర్లు కమిషనర్ గంగాప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ స్పందిస్తూ సమస్యలన్నిటిని పరిష్కరిస్తామంటూ సభ్యులకు సమాధానమిచ్చారు. పాతరాయచోటిలోని తమ ఇంటి ముందు రోడ్డు వేయలేదంటూ మున్సిపల్ ఇన్‌చార్జ్ ఆర్‌ఐ సుబ్బరాయుడు చేసిన ఆరోపణలను సభ్యులు ఖండించారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాల పంపిణీలో జరుగుతున్న ఆలస్యంపై కౌన్సిలర్ విజయమ్మ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీతాలు అందేలా చూడాలంటూ కమిషనర్‌ను కోరారు. అనంతరం మున్సిపల్ వార్షిక బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, ఆసిఫ్ అలీఖాన్, గౌస్‌ఖాన్, రౌనఖ్ హుస్సేన్, సాదక్‌అలీ,మిట్టా గీతావాణి, జానం రాధ, జబీవుల్లా, చంద్రశేఖర్,లక్ష్మీదేవమ్మ, కో- ఆప్షన్ సభ్యుడు ఆసిఫ్‌అలీఖాన్, వైఎస్‌ఆర్‌సిపి నేతలు బుజ్జిబాబు, సుగవాసి శ్యామ్‌కుమార్, పింఛా భాస్కర్, మున్సిపల్ ఉద్యోగులు సచివాలయం ఉద్యోగులు,పలుశాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని వసతులతో పోలింగ్ కేంద్రాలు



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంఈఓలు

లక్కిరెడ్డిపల్లె : ఏప్రిల్ నెలలో జరగబోవు శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మంగళవారం ఎన్నికల అధికారులు తహసీల్దార్ ఉదయ్ శంకర్ రాజు, ఎంఈఓ చక్రే నాయక్‌లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో మొత్తం 33 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అందులో వసతులు లేని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టి అన్ని వసతులను కల్పిస్తామని వారు తెలిపారు. పోలింగ్ కేంద్రం మూడును బురుజుపల్లెకు మార్చారు. బురుజుపల్లె పాఠశాలలో వసతులు లేవని, నాడు – నేడు కింద పనులు జరుగుతున్నాయని, త్వరలోనే విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంప్ లాంటి అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆ పాఠశాల ఉపాధ్యాయుడికి సూచించారు. అలాగే రెడ్డివారిపల్లె ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు వారు తెలిపారు. అనంతరం జాండ్రపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రధానోపాధ్యాయునికి సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి అర్బన్ : అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) డిమాండ్ చేసింది. బీటీఏ నేతలు మంగళవారం రాయచోటి డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులును కలుసుకుని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌లను వెంటనే రద్దుచేయాలన్నారు. 11వ పీఆర్‌సీ, డీఏ అరియర్స్ రూ.7382 కోట్లు వెంటనే చెల్లించాలన్నారు. గత ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.1000 కోట్లకు పైగా పీఎఫ్‌లోన్లు తదితర పేమెంట్లు చెల్లించాలన్నారు. ప్రతి నెలా 1న జీతాలు చెల్లించాలన్నారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్‌సీని వంఎటనే అమలు చేయాలని, జీఓనం. 117ను రద్దుచేయాలని కోరారు. కార్యక్రమంలో బీటీఏ నేతలు ఆర్. రవిశంకర్, అబ్దుల్ రజాక్, వెంకటరమణ, నాగార్జున, నిరంజన్ తదితరులు పాల్గొ న్నారు.

సర్వసభ్య సమావేశానికి అధికారుల డుమ్మా!

ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి

పుల్లంపేట : మంగళవారం పుల్లంపేటలోని ఎంపీపీ సభా భవనంలో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడంతో వారిపై ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అనంతంపల్లి, జాగువారిపల్లి పంచాయతీలలో తాగునీటి సమస్య ఉందని తమ దృష్టికి వచ్చిందని, తక్షణమే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాలలో పర్యటించి పైపు లైన్లకు మరమ్మతులు నిర్వహించాలని ఎంపీపీ ఆదేశించారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అన్నమయ్య జిల్లా మాజీ కలెక్టర్ గిరీషా పీఎస్‌లు కస్తూర్బా ఆదర్శ పాఠశాలకు గుంతలు పూడ్చడానికి రూ. 20 లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. వారికి ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలలో విద్యుత్ దీపాలు వెలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే వేసవికాలం దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య లేకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. మండల పరిధిలోని అప్పారాజుపేట గ్రామ పంచాయతీకి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ. 20 లక్షలు నిధులు మంజూరయ్యాయని పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య తెలిపారు. అనంతరం విద్యుత్ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి 24 గంటలు విద్యుత్‌ను అందించడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో మండల వ్యాప్తంగా ప్రతి పంచాయతీకి తాగునీటి కోసం 24 గంటలు విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయశంకర్ నాయుడు, రామనాథం, ఎంపీడీఓ రఘురాం, ఎం.శంకర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ఆలం చెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా నిధులు ఖాతాల్లో జమ

రామాపురం : మండలంలోని 476 డ్వాక్రా సంఘాలలోని 4,789 మంది డ్వాక్రా మహిళలకు రూ.3.26 కోట్లు మంజూరైనట్లు ఏపీఎం దేవసేన తెలిపారు. మంగళవారం నాల్గో విడత వైఎస్సార్ ఆసరా కింద మహిళలకు మంజూరైన చెక్కును అందించి, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిధులను మంజూరు చేసినట్లు తెలియజేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్‌సీఎం చర్చిలో రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చేతులమీదుగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేస్తామన్నారు. కార్యక్రమానికి డ్వాక్రా సంఘాల మహిళలు హాజరు కావాలని కోరారు.

'సర్వేయర్ రాజేంద్రను సస్పెండ్ చేయాలి'

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ సర్వేయరుగా ఉంటూ తన తల్లి పేరిట గ్రామంలోని 4.50 ఎకరాల భూమికి 1బిని సృష్టించుకుని సర్వేయర్ రాజేంద్రను వెంటనే సస్పెండ్ చేయాలంటూ బి.కొత్తకోట మండలం గుండువారిపల్లె గ్రామస్థులు సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, జిల్లా రైతుసంఘం నేత వంగిమళ్ల రంగారెడ్డిలు మాట్లాడుతూ గుండువారిపల్లె గ్రామంలోని సర్వేనంబరు 271, 271/1, 272, 285లలో 4.50 ఎకరాల భూమిని ప్రభుత్వ సర్వేయర్ రాజేంద్ర తన తల్లి పేరు మీద రికార్డులు సృష్టించుకుని స్వాధీనం చేసుకున్నారన్నారు. ఫలితంగా సదరు భూమిలోని చిన్నచిన్న గుడులు, శ్మశాన స్థలం, చింతచెట్లు తదితరాలు గ్రామస్తులకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సర్వేయర్ రాజేంద్రపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం ఈమేరకు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గుండువారిపల్లెకు చెందిన రైతులు సుదర్శన్, చంద్రమోహన్, భాస్కర్, కె.వి.రమణ, శ్రీరాములు, లక్ష్మినారాయణ, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే సీఎం లక్ష్యం



విద్యార్థులకు ట్యాబ్ పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : పేదరికం లేని సమాజమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పెద్దకారంపల్లె ఎంపీటీసీ వరదరాజు, సర్పంచ్ వెంకటరాజు తెలిపారు. పెద్దకారంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎంపీటీసీ, సర్పంచ్ చేతుల మీదుగా ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నత విద్యావంతులైనప్పుడే సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగిపోగలవని విశ్వసించిన ఏకైక సీఎం జగన్ అన్నారు. అందువల్లే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి చర్యలు తీసుకున్నారన్నారు. నాణ్యమైన విద్య కోసం ట్యాబ్‌లను విద్యార్థులకు అందించారన్నారు. పేద విద్యార్థుల చదువు కోసం హితోదికంగా ఖర్చు చేస్తున్న సీఎంకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో జగన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటరాజు, హెచ్‌ఎం ఎస్ సుబ్రమణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముడి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు




కోలాటం, భజనలు చేస్తున్న యువత

సిద్దవటం : మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రాముడి ఆలయంలో సోమవారం రాత్రి స్వామివారి విగ్రహాన్ని వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అయోధ్య రామాలయంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని మాచుపల్లిలో శ్రీ సీతారామ, లక్ష్మణ ఆంజనేయ స్వాముల ఉత్సవమూర్తులతోపాటు శ్రీరాముడి విగ్రహానికి గ్రామోత్సవం చేశారు. భక్తులు కాయాకర్పూలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. స్వామి వారి గ్రామోత్సవం వద్ద మహిళలు, యువత కోలాటం భజనలు, మంగళ వాయిద్యాలతో బాణసంచా పేల్చుతూ వైభవోపేతంగా కార్యక్రమం జరిపారు.

40 లీటర్ల సారా స్వాధీనం

పీలేరు : ద్విచక్రవాహనంతో పాటు 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య తెలిపారు. మంగళవారం సెబ్ అధికారులకు అందిన సమాచారం మేరకు మండలంలోని అరవవాండ్లపల్లె దారి వద్ద దాడి చేశారు. ఈ దాడిలో దిగువమేకలవారిపల్లెకు చెందిన పి. శేఖర్ ద్విచక్ర వాహనంలో సారా తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇన్నోవేషన్ ఛాలెంజ్‌కు విద్యార్థులు



అఫ్రీన్, ఆర్షియాలు

నందలూరు(రాజంపేట) : బెంగుళూరులో జరిగే జాతీయ స్థాయి స్టూడెంట్స్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ఫైనల్స్‌కు గొబ్బిళ్ళ అక్షర స్కూల్ విద్యార్థులు అఫ్రీన్, ఆర్షియాలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్‌లు గొబ్బిళ్ళ త్రినాథ్, గొబ్బిళ్ళ శ్రీనాథ్‌లు మంగళవారం మాట్లాడుతూ ప్రతి ఏటా జాతీయస్థాయిలో నిర్వహించే స్టూడెంట్స్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ మొదటి దశలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు ద్వారా వేల మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రతిభను కనబరచగా, రెండో దశకు ఇరవై టీమ్‌లను ఎంపిక చేయగా అందులో తమ పాఠశాల విద్యార్థులు అఫ్రీన్, ఆర్షియాలు ఎంపిక అయ్యారన్నారు. వీరు రైతుల క్షేమం కోసం తయారు చేసిన అక్షర అస్త అనే ప్రాజెక్టు జ్యూరీ సభ్యులను విస్మయ పరిచిందని, వీరు చేసిన కృషికి జాతీయస్థాయిలో గుర్తింపు పొంది ఫైనల్స్‌కు ఎంపిక కాబడ్డారన్నారు. ఇటువంటి అవకాశాలు కల్పిస్తున్న పాఠశాల యాజమాన్యానికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం



ప్రత్యేకంగా అలంకరించిన సయ్యద్ సాదక్ వలి సమాధి

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్ట చెరువులో వెలసిన సయ్యద్ సాదక్‌వలి ఉరుసు మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. దర్గా ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దర్గా వద్ద ఏర్పాటు చేసిన ఖవ్వాలి ఆకట్టుకుంది. ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఎస్‌వీ రమణ హాజరై దర్గా వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గజ్జల నరసింహారెడ్డి, లాయర్ రామదాసు, తుమ్మలకుంట ఈశ్వరయ్య, దొంతరంపల్లి లక్ష్మిరెడ్డి, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి



రోడ్డు భద్రతావారోత్సవాలలో పాల్గొన్న ఎంవీఐ వినోద్ కుమార్, ఆర్టీసీ డీఎం రమణయ్య

రాజంపేట : విధి నిర్వహణలో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని రాజంపేట ఎంవీఐ వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం రాజంపేట డిపో ఆర్టీసీ గ్యారేజ్‌లో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుమీద వెళ్లేటప్పుడు కొన్ని పద్ధతులు పాటిస్తే సేఫ్‌గా గమ్యం చేరుతారన్నారు. టూవీలర్ మీద వెళ్లేటప్పుడు హెల్మెట్, ఫోర్ వీలర్ మీద వెళ్లేటప్పుడు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. అలాగే రోడ్డు సిగ్నల్స్ పాటించి సేఫ్‌గా డ్రైవింగ్ చేయాలని, మలుపులలో సిగ్నల్స్ చూసి జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలనేది ముఖ్యమన్నారు. డిపో మేనేజర్ రమణయ్య మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని తెలుసుకోవాలన్నారు. ఆర్టీసీ హెవీ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తుందన్నారు. ఇప్పటికే అనేక మంది డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించామన్నారు. సమావేశంలో సుమారు 40 మంది ట్రైనింగ్ డైవర్లు, డిపో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

పేదవారికి వైద్యం అందించడమే ధ్యేయం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రంగలక్ష్మి

సిద్దవటం : గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష ధ్యేయమని ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్ తెలిపారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్ మాట్లాడుతూ పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, ఆయా గ్రామాల్లోని వ్యాధిగ్రస్తులకు వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు, ఆస్తమాతో బాధపడుతున్నవారు ఎక్కువగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వస్తున్నారన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మల్లు వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి ఒక్కరికీ శ్రీరామ రక్ష అన్నారు. జిల్లా కేంద్రంలో వైద్యుని సంప్రదించాలంటే రూ.300 ఫీజు తీసుకుంటున్నారన్నారు. పేదవానికి వైద్యం ఉచితంగా అందే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో వైద్య సేవలు అందించడంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, సర్పంచ్ ప్రతినిధి మల్లు భాస్కర్‌రెడ్డి, వైద్యులు డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ రంగలక్ష్మి, డాక్టర్ లక్ష్మీకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రెహాన్ సీహెచ్‌ఓ శంషాద్ బేగం, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల కృషి మరువలేనిది



చిట్వేలి: నివాళి అర్పిస్తున్న మానవత సేవా సంస్థ సభ్యులు



రాయచోటిలో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రాయచోటి అర్బన్ : భారత స్వాతంత్ర్య సమరంలో మహనీయుల కృషి మరువలేనిదని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని స్థానిక బంగ్లా సర్కిల్‌లోని నేతాజీ విగ్రహానికి ఆయన కౌన్సిలర్లు, వైఎస్‌ఆర్‌సీపీ నేతలతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ లాంటి మహనీయుల పోరాట ఫలితమే మనకు స్వాతంత్ర్యం లభించిందన్నారు. శాసన ఉల్లంఘన ఉద్యమంలో పాల్గొనడంతో నేతాజీ జైలు పాలయ్యారన్నారు. 1943లో నేతాజీ జపాన్‌లో నేషనల్ ఇండియన్ ఆర్మీని స్థాపించి భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కమిషనర్ గంగాప్రసాద్, ఆర్ఐ మల్లికార్జున, కౌన్సిలర్లు గౌస్‌ఖాన్, ఈశ్వర్ ప్రసాద్, అల్తాఫ్, కొలిమి చాన్‌బాషా, ఆసిఫ్‌అలీఖాన్, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు సుగవాసి శ్యామ్‌కుమార్, జానం రవీంద్ర, పల్లా రమేష్, సయ్యద్ రియాజ్, చంద్రశేఖర్, వైఎస్‌ఆర్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుబాష్ చంద్రబోస్ 127వ జయంతిని మానవత సభ్యులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విద్యా వనరుల కార్యాలయ ప్రాంగణంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాశాఖ అధికారి ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం సుభాష్ చంద్రబోస్ చేసిన త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో మానవత బాధ్యులు సాయిరాం, మునికాలు, గౌరవ డైరెక్టర్ బోర్డు సభ్యులు రంగారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సహాయ కార్యదర్శి సుబ్రమణ్యం రెడ్డి, సభ్యులు సురేంద్ర, నితిన్, సత్యనారాయణ, తేజ, సాయి కృష్ణ, సుబ్బు, నాగరాజు, బాలాజీ, శేఖర్, రబిక్ తదితరులు పాల్గొన్నారు.